

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

# ఆంగ్లము – శిక్ష

( ష్..ష్..ష్...కాసేపాగండి, ఇంపార్టెంట్ మీటింగ్ లో ఉన్నా. )

" సో, బే..సికల్లీ, ఇన్ ఆర్డర్టు ఇంప్లిమెంట్ దిస్, వుయ్ నీడ్టు టేక్ ఆల్ దోజ్ స్టెప్స్." అంటూ మీటింగు ముగించి, క్రిస్పీక్రీం డోనట్లు వాళ్ళ ముందుకు తోసా. భౌ భౌ మని సౌండు వినపడలేదుగానీ, ఆల్మోస్ట్ అదే లెవెల్లో ఎగబడి రెండునిమిషాల్లో ఊదేసారు మూడు పెట్టెలు. మరి పీ.ఎం.పీ నా మజాకా, ఊరికే తగలేసాననుకున్నారా రెండువేలు. అక్కడనేర్చిన ట్రిక్కులకి మన అగ్రహారం ఒరిజినాలిటీని జతచేసి, జయభేరి సినిమాలో చెప్పినట్టుగా "హిందోళ చక్రవాక రాగాలను మేళవించి" , ఈ మీటింగు పెట్టా. దెబ్బకి పడిపోయారు పీనుగులు అనుకుంటూ తెగ సంబరపడిపోయా ఓ నిముషం.

మా తెల్ల బాసుగాడొచ్చి " వండర్ఫుల్, సింప్లీ సూపర్బ్. నెక్స్ట్టైం, ప్లీజ్ గెట్ మోర్ ఆఫ్ దోజ్ ఫ్రెంచ్ కర్ల్స్ అండ్ మంచ్ కిన్స్. . దోజ్ – ఆర్ మై ఫేవరెట్స్" అన్నాడు వేళ్ళు నాక్కుంటూ.

" ఒరినీ తిండి తిమింగళాలెత్తుకెళ్ళ, నువ్వు చెప్పేది డోనట్ల గురించా, మంచ్ కిన్ లా మొహం నువ్వూను.." అనుకుంటూండగానే మళ్ళీ అన్నాడు

" బై ద వే, ప్లీజ్ సెండ్ యువర్ మీటింగ్ సమ్మరీ ఏజ్ ఎ వర్డ్ డాక్యుమెంట్. పవర్ పాయింట్ వుడ్ బీ ఈవెన్ బెటర్.." అంటూ వెళ్ళిపోయాడు.

" యా..యా " అంటూ ఫాలో అయిపోయారు మిగిలిన మంచ్ కిన్ టామీ గాళ్ళు.

అంటే.. వీళ్ళకి నేను చెప్పింది ఒక్కముక్కకూడా అర్థం కాలేదన్నమాట. ఊసుపోక మీటింగ్ పెట్టి ఇరవైడాలర్ల దూలతీర్చుకుని డోనట్లు మేపింది కాక, ఇంకా నాలుగ్గెంటలు కూర్చుని వర్డ్ డాక్యుమెంట్లూ, పవర్ పాయింట్లూనా. ఆయనేవుంటే మంగలాడెందుకన్నట్లు, అవి చేసే ఓపిక లేకే కదా మీటింగు పెట్టింది, అయినా అంతసేపు ధాం ధూం అని మాట్లాడాను కదా, వీళ్ళకేమీ అర్థంకాలేదేమిటబ్బా అని వగచి, వచ్చి సింహాసనంలో కూర్చున్నా.

ఇప్పుడు చెప్పండి, నేను వాళ్ళలా ఇంగ్లీషు మాట్టాడకపోవడం నా తప్పా ? వాళ్ళల్లో ఒఖ్ఖ పీనుగుని నాలా..కాదు కాదు, కనీసం ఎలాగో అల్లా తెలుగు మాటాడమనండి " **వాళ్ళ పస కాననయ్యేడిన్.."** .

అమెరికా వచ్చి పుష్కరం మీద మూడేళ్ళైనా, వీడి యాస పట్టుబడింది కాదు, మనదంతా దొరల పద్ధతాయె. వీడు ఎడ్డెవంటే తెడ్డెవనే రకం. ప్రయత్నలోపం లేదుసుమా, ఎన్నో సార్లు తెల్లవాళ్ళతో పర్సనల్ కోచింగులుకూడా తీసుకున్నా. ఇప్పుడు వాళ్ళందరికీ విభక్తులూ, సమాసాలూ, త్రికసంధి సూత్రాలూ, గోవింద నామాలూ వచ్చేసాయి. ఒకళ్ళిద్దరు తెలుగులో పీహెచ్‌డీలు కూడా చేస్తున్నారు, నా యింగ్లీషుమాట దేవుడెరుగు.

అయినా నన్నని ఏం లాభం? తమ్మిచూలి నా తలరాత అల్లారాస్తేను. ఎంత తెలుగు మీడియం గాణ్ణైనా, రాయడం లో మనం పులి, ఇంగ్లీషైనా, హిందీ అయినా సరే. హైస్కూల్లో ఓ మాటు హిందీ పేపర్లో అడిగారు **"మైథిలీ శరణ్‌గుప్త్ కే విచార్ కైసే హై?"** నేనింక రెచ్చిపోయాను.."**జబ్ కోయీ మర్ జాతే హై తో హం " విచార్ " కర్తే హై. ఉన్‌కే విచార్ హృదయ్ విదారక్ హై, భయానక్ హై, అబ్ మై రోతా హూ"** . అంటూ. తరవాత మూ్డ్రోజులు మా హిందీ మేష్టారు కనపడలేదు. వాకబు చేస్తే తెలిసింది వూరు వదిలిపెట్టి వెళ్ళిపోయారని. అప్పుడు నేను చాలా " **విచారించాను** ", అటు నన్నయ్యకీ, ఇటు తిక్కన్నకీ లేని నాలాంటి ఆణిముత్యంలాంటి శిష్యుణ్ణి ఆయన కోలుపోయారుకదా అని.

సరే మా బాసుగాడి రోగం కుదర్చడానికి నేను రాయడం మొదలెట్టా. **"ఇమినెంట్ త్రెట్ టు ఇంటర్నల్ సిస్టంస్ "** అంటూ ప్రాసకుదిరేలా, భయపెట్టేలా హెడ్డింగు పెట్టి. రాస్తున్నానన్న మాటేగానీ, బుర్ర బుర్ర లో లేదు. చిన్నప్పటినించీ , చదువు ఆపేసేంత వరకూ నాకు ఇంగ్లీషు నేర్పిన కేరెక్టర్లంతా బుర్రలో ఒకళ్ళచొక్కా ఒకళ్ళు పట్టుకుని రైలాట ఆడుకుంటున్నారు...

నేను పదో తరగతి దాకా తెలుగు మీడియమే. అయినా, ఇంగ్లీషు కూడా వుటుంది కదా థర్డ్ లాంగ్వేజ్ అనుకుంటూ. రెండో తరగతిలో ఇనస్పెక్షన్ రోజున ఇంక బావుండదని నేర్చుకున్నా మొట్టమొదటి ఇంగ్లీషు పద్యం " **హంప్టీ డంప్టీ శేట్ ఆన్ ఎ వాల్** ". నాకు ఆ పద్యం నోరు తిరగలేదు, నేనే తిరిగి చూసాను, రాలేదు. అయినా నా పర్సనాల్టీకి ఆపద్యమే సూట్ అవుతుందని మా మేష్టారు డిసైడైపోయారు, ఆయన రోజు బాలేక. సరే మా ఆచారి గారొచ్చారు, ఖాకీ పాంటూ, టకప్ చేసిన ఖద్దరు చొక్కా, నీరుకట్టు పాములా ఉండే సన్నని తెలుపూ, ఆకుపచ్చ గీతల బెల్టూ, బూట్లతో. ఆయనొచ్చి అడిగే సరికి మనం మొదటిలైను కూడా మర్చిపోయాం.

ఆయనకే జాలివేసి, " **పోనీ ట్వింకిల్ ట్వింకిల్ చెప్పు** "అన్నారు. అదైతే పులి కదా, చెప్పేసాను. ఆయన కళ్ళు పెద్దవిచేసి, అన్నారు.." **నా హో, నా హో నా హో..".**

మా మేష్టారికేమీ అర్థంకాలేదు. " **సరిగ్గానే చెప్పాడు కదండీ** " అన్నారు బిక్క చచ్చిపోతూ.

"**ఆ పద్యం ఎల్లా చెప్పాలంటే..**" (బోచేవారెవరురా?) అంటూ చేతులు విదిలించి.. "**ట్విం....కి...ల్ల్ల్ల్ ట్విం...కి...ల్ల్ల్ లిట్టిల్ స్టార్ర్ర్ర్ర్ర్..**" అంటూ గొంతు వణికిస్తూ, చర్చిలో పాడేపాటల్లా మెస్మరైజింగ్ గా పాడారు.

" **ఓహో** " అనుకుంటూ నేనుకూడా అల్లాగే ప్రాక్టీసు చేసి సాధించాను. కాపోతే కాస్త ప్రాక్టీసు ఎక్కువై, అదే జబ్బు నా తెలుగుకి కూడా అంటుకుని ఆఖరికి " **అమ్మా, అన్నం పెట్టు** " అనే వాక్యంకూడా వణుకుతూ పాడేసరికి, మా అమ్మకి డౌటొచ్చింది, ఇదేవన్నా నరాల బలహీనతేమో అని. మా నాన్నగారికి చిర్రెత్తింది. అంతే నా ఆంగ్ల పద్య పఠనానికి ఆ రోజే తెరపడింది.

హైస్కూల్లో ఆరోతరగతిలో వున్నప్పుడు రామ్మూర్తిగారు చెప్పిన ఒక్కటే పాఠం గుర్తు. ఎవడో శాంసన్ గాడు, వాడో జుట్టుపోలిగాడు, వాడి బలం వాడి జుట్టులోనే ఉంది అనుకుంటూ. సరే, రోజూ ఈ పోరెక్కడపడతాం అని ఆయనకి మా చెట్టు కరివేపాకు రుచి అలవాటు చేసా. ఆయన మాయింటిమీదుగానే ఇంటికెళ్ళేవారు. వెడుతున్నప్పుడల్లా ఓ నమస్కారం పెట్టి, రెండు కరివేపాకు కట్టలిచ్చేవాణ్ణి, లేతవి ఏరి. మా కరివేపాకు చెట్టు పుణ్యవాని అక్కడున్న రెండేళ్ళూ, ఇంగ్లీషులో తిరిగిచూసుకునే పని లేకపోయింది. నిజంగానే కరివేపాకు ఆరోగ్యానికి చాలా మంచిది. సరే, ట్యూషన్‌లో చంద్రరావుగారు కొత్త పద్యం చెప్పారు " **రో..రో...రా.ఎబోవ్..**" అంటూ. కానీ నాన్నగారంటే భయం వల్లా , అమ్మమీద జాలి వల్లా, ఇంట్లో ప్రాక్టీసు చెయ్యలేదు, ఎందుకేనా మంచిదని. ట్యూషన్‌లో మాత్రం గొంతువిప్పి పాడేవాణ్ణి, అమ్మాయిలు కళ్ళింతింత చేసుకుని చూసేవారు కదా మరి, అందుకని.

ఈ మధ్యలో నన్ను ఇంగ్లీషు మీడియంలో వేద్దావనే కుట్ర ఒకటి జరిగింది. సరే విషయం కనుక్కొద్దావని నాన్నగారు నన్ను తీసుకుని ఒక కాన్వెంటు స్కూలు కెళ్ళారు. గేటుదెగ్గరుండగానే లోపల్నించి ఎవరో పిల్ల అంటోంది వేరే పిల్లతో " **ఒసే ఒసే మీ ఫాదరొచ్చాడు, గో...**"

ఆపిల్లంటోంది.." **నోయే. అది మా ఫాదర్ కాదు, ఎవరో అంకుల్సే. సరే, ఇప్పుడు నీ చేతిలో బాల్ త్రో...**".

అంతే, మళ్ళా కాలేజీ కెళ్ళేదాకా మా యింట్లో ఇంగ్లీష్ మీడియం ఊసెత్తలేదు.

ఎనిమిదిలో హైదరాబాద్ వచ్చేసాం. అక్కడ రావు గారి శిష్యరికం. వస్తూనే ఆయనకి తెలిసిపోయింది నాన్నగారు రెవెన్యూ డిపార్ట్‌మెంటని. ఎప్పటికైనా ఉపయోగపడతాననే ఉద్దేశ్యంతో నన్ను బానే చూసుకునేవారు, కొట్టకుండా. కానీ ఆయన గ్రామరే చెప్పేవారు ఎంతసేపూ " **కెన్, కుడ్, షల్, షుడ్** " అనుకుంటూ. అదేమో మనకోపట్టాన ఎక్కేది కాదు. సరే, పడుతూ లేస్తూ పది పూర్తయింది.

జూనియర్ కాలేజీ లో నునూగు మీసాల నూత్న యవ్వనంలో, ఓ శుభ ముహూర్తాన, మొదటిసారి ఇంగ్లీషు క్లాసులో కుడికాలు పెట్టా. పాఠాలు వినడం మానేసి, చుట్టుపక్కల కూర్చున్న అమ్మాయిల్ని చూసే ఘడియలవి. కానీ, ట్రెండ్ కి భిన్నంగా, మేము పాఠం చెప్పే

బెంగాలీ లెక్చరర్నే చూసేవాళ్ళం " నీవే తప్ప ఇతః పరంబెరుగ " అన్నట్టుగా. అనుకోకుండా పెదాలమీదకి పాటొచ్చేసేది " నిర్మల సురగంగాజల మంజుల స్వర్ణకమలమో, క్షీరసాగర సమానీత సుధాపూర్ణ కలశమో..". ఈవిడకింకా క్లియర్ సెల్ గురించి తెలియదేమో, తెలిసుంటే, ఆ మూడు మొటిమలూ కూడా ఉండేవి కావు కదా...హత విధీ, ఇంకా పెళ్ళీడుకూడారాని ఈవిడికి పెళ్ళైపోవడవేవిటో, ఆ లావుపాటి మొగుడుగాడు దున్నపోతులా ఇంట్లో క్రికెట్ మాచ్ చూసుకుంటూ ఈవిడ్ని పనిచేయించడవేవిటో.. "

పక్కనున్న శ్రీహరి గాడు గిల్లితేగానీ, ఈలోకంలోకి రాలేదు నేను. ఆవిడ చెప్పడం అయిపోయింది. గంటమోగిపోయింది. అయ్యో, ఆవిడ వెళిపోతోంది. వెంఠనే లేచి నిలుచున్నాను. ఆవిడ వెనక్కి తిరిగి " ఎనీ క్వశ్చన్స్ " అని అడిగింది. " అర్జెంటుగా బెంగాల్ వెళ్ళాలంటే ఏ(ట్రెయినెక్కాలి మేడం? " అని అడిగానని తరవార శ్రీహరిగాడు చెప్పాడు. అదిగో, ఆవిడ పుణ్యాని ఇంగ్లీషు కాస్త అబ్బింది, " శీనిగాడు నేర్వగరాని విద్యగలదే సింగారి నేర్పించినన్ " అన్నట్టుగా.

సరే ఆనక ఐదేళ్ళుపోయాకా అందరూ రాస్తున్నారని, విదేశాలెళ్ళే విద్యార్థులు రాసే ఇంగ్లీషు పరీక్ష రాసాను. పరీక్ష హాల్లో వాడేదో కేసెట్ వినిపించాడు. రామచంద్రపాహీ, ఆకేసెట్ లో మాట్లాడిన వాడెవడోగానీ వాడికీ వాడి పెద్దలకీ వేనవేల దణ్ణాలు. ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు. చిర్రెత్తిపోయి నా ఇష్టం వచ్చినట్టు రాసేసాను ఆన్సర్లన్నీ. ఓ రెండువారాలు పోయాకా మాయింటికి ఒక తెల్లవాడొచ్చాడు, ఆ పరీక్ష నిర్వహించినవాళ్ళు పంపించారంటూ. వాళ్ళు వాడికి మూణ్ణెల్ల గ్రాంట్ ఇచ్చి, అసలు నేనెలా వుంటానో చూసి, వీలైతే నాకు కాస్త ఇంగ్లీషు నేర్పి రమ్మని పంపించార్ట. కేసెట్ లో మాట్లాడిన ప్రబుద్ధుడు కూడా వాడేట. సరే మూణ్ణెల్లిట్టే తిరిగిపోయాయి. మన కందాబచ్చలీ, ఆవ పులుసులూ, పులిహోరలూ, చిరంజీవి సినిమాలూ వాడికి బాగా వంటపట్టాయి. వాడు ఓ లక్షణమైన తెలుగమ్మాయిని పెళ్ళిచేసుకుని హైదరాబాదులో స్థిరపడిపోయాడు. నాకూ వాడిగొంతు అలవాటవడం వల్ల, రెండో ప్రయత్నంలో గట్టెక్కాను.

ఫ్రెండ్స్ చెబితే, స్పోకెన్ ఇంగ్లీషు నేర్చుకుందామని విదేశీ భాషలు నేర్పే ఓ సంస్థ కెళ్ళా తారనాకా లో. అక్కడ ఇన్స్ట్రక్టర్ ని చూసి, - ఇన్స్టాంట్ గా ఇన్స్పైరయ్యి, బాగా ఆలోచించి అరగంటలో ఓ నిర్ణయానికొచ్చి, ఇంగ్లీషులో అరఠావు ఉత్తరం రాసా, ప్రేమిస్తున్నాను, ఇచ్చేమాట చెప్పు అంటూ. వాళ్ళనాన్న ఇంగ్లీష్ ప్రొఫెసరట. నా ఉత్తరంలో స్పెల్లింగు మిస్టేకులూ, గ్రామరూ, టెన్సూ, మూడ్ అన్నీ కరక్టు చేసి, అనవసరమైన వాక్యాల్ని కొట్టేసి, ముఖ్యమైన వాటిని అండర్ లైను చేసి వీలుచూసుకుని మళ్ళీ రాయవలసినదిగా అభ్యర్థిస్తూ, తిరిగిపంపించేసాడు వాళ్ళ అమ్మాయిచేత.

నేను ఒకసారి రాయడమే గొప్ప. మన బద్ధకానికితోడు మళ్ళీనా. అయినా సరే, పాపం ప్రొఫెసర్ గారు అడిగారు కదాని, పెద్దాయన మాట కాదనలేక , ఓ వారం రోజుల్లో ఫెయిర్ చేసిన డ్రాఫ్టు పట్టికెళ్ళా వాళ్ళింటికి.

అది చదివి ఆయన నన్నెత్తుకుని ముద్దెట్టేసుకుని " వెరీగుడ్ ఇంప్రూవ్‌మెంట్, ఇందా స్వీట్ తిను" అన్నారు స్వీటందిస్తూ.

" వద్దండీ, కతికితే అతకదంటారు, దీన్ని ఇంగ్లీషులో ఏమంటారో కూడా నాకు తెలియదు " అని మొహమాటపడుతూంటే..

" **ఈట్ మై బోయ్..ఇది మా అమ్మాయి పెళ్ళి స్వీటు , నిన్ననే చేసాం** " అని బలవంతంగా తినిపించారు. నిన్న చేసింది పెళ్ళో, స్వీటో అర్థం కాలేదు. అయినా అడగాలనిపించక, వచ్చేసా. అల్లా అదికాస్తా పుసిగిపోయింది.

రెండో ఇన్స్ట్రక్టర్ కి రెండోరోజే రోజిచ్చా, ముందస్తుగా . . ఆమర్నాడు ఆవిడ కొత్తబట్టలు కట్టుకొచ్చింది పాఠం చెప్పడానికి. విషయం ఏవిటంటే, ఆవిడ పెళ్ళి కుదిరిందిట నేను రోజిచ్చిన రోజే. ఎంతో సంబరంతో నాకూ, ఇంకా అందరికీ ఈ విషయం చెప్పింది కేడ్ బరీస్ నోట్లోపెడుతూ.

ముచ్చటగా మూడో సారి ప్రయత్నిద్దామనుకుంటూండగా, ఆ మూడో ఇన్స్ట్రక్టరే ఓ గులాప్పువ్వు పట్టుకొచ్చి, నన్ను పక్కకి తీసుకెళ్ళి " **ప్లీజ్ ప్లీజ్ నాక్కూడా ఇవ్వవా, నీచేత్తో ఇస్తే నాక్కుడా మా అమెరికా బావతో పెళ్ళిజరుగుతుంది, ప్లీజ్..**" అంటూ ప్లీజ్ చేసేసింది. ఆవిడ సెంటిమెంటు కాదనలేక, పొట్టి కమలహాసన్లా పెదాలు సాగతీసి, పువ్విచ్చేసా, పైకి నవ్వుతూ. ఆనాటితో నాకింగ్లీషుతో ఋణం తీరిపోయింది.

కాలక్రమేణా వీసా వచ్చేసి ఇక్కడికొచ్చేసాను. మొదట్లో ప్రయత్నించాను, వీళ్ళలాగా మాట్లాడడం నేర్చుకుందావని. కుదర్లేదు. అయినా నా యింగ్లీషులో ఆట్టే తప్పులుండవు కదా. మొన్నో పెద్దాయన ఫోన్ చేసి నీ మొహం చాలా " **ఫొటో జెనెటిక్** " గా వుందన్నాడు. ఆయనో పేద్ద కంపెనీకి మాలిక్. మరొక ప్రొఫెసర్ గారు మాట్లాడుతూ **అందరూ విరాళాలివ్వండి** అనాల్సిన చోట " **ప్లీజ్ డొనేట్ యువర్ సెల్ఫ్** " అంటే నాకు గుండాగినంత పనైంది. అయినా ఇక్కడకూడా కొంతమంది దొంగపీనుగులు మన భాష అర్థం అయినా కానట్టు ఫోజులు కొడతారన్న విషయం కూడా గమనించాను.

ఇల్లాంటివన్నీ వినీ కనీ విసుగెత్తి, నేనూ తెగించాను. ఇప్పుడు నేను మాట్లాడిందే ఇంగ్లీషు. అర్థం అయ్యిందా మీ పుణ్యం పుచ్చింది, కాలేదూ మీ ఖర్మ.

" **తెగించినమ్మకి తెడ్డే లింగం..**"